సమావేశంలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్

జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీ, దిశ ఛైర్మన్ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రం, రాష్ట్రం నుంచి జిల్లాకు ఎక్కువ నిధులు తీసుకొచ్చి జిల్లా అభివృద్ధి జరిగేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని అనంతపురం ఎంపీ, దిశ ఛైర్మన్ అంబికా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో మంగళవారం నాడు జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని ఎంపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, నగర పాలక సంస్థ మేయర్ వసీం, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్‌ఒ ఎ.మలోల, జెడ్పీ సీఈవో వెంకటసుబ్బయ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వస్తున్న నిధులు సకాలంలో ఖర్చు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలులో ఏవైనా లోటుపాట్లు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. జిల్లా నుంచి మళ్లీ కిసాన్ రైలు ఏర్పాటుకు కషి చేస్తామన్నారు. ఆసుపత్రుల అభివృద్ధి, గృహ నిర్మాణాల తదితర కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా వచ్చే పథకాలను లక్ష్యాల మేరకు అమలు చేసేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. కలెక్టర్ ఇనోద్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించుకోవాల్సి ఉందన్నారు. ఆయా పథకాల అమలులో స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యక్రమాలను రూపొందించుకొని పూర్తిస్థాయిలో లక్ష్యాలను చేరుకునేందుకు, అర్హత కలిగిన లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరారు. ఉద్యాన వన రైతుల కోసం కిసాన్ రైలును ప్రారంభించాలన్నారు. జిల్లాలో జరుగుతున్న వ్యవసాయ కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కోరారు.ఉద్యాన పథకాలపై సమావేశాలను నిర్వహించి రైతులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, సిపిఒ అశోక్ కుమార్, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్ గందరగోళం..!

సూపర్ -6 హామీల అమల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఏడాదికి మూడు సిలిండర్లు ఇచ్చేలా ప్రకటన చేసింది. ఇందులో భాగంగా దీపావళి కానుకగా మంగళవారం నుంచి సిలిండర్ బుక్ చేసుకున్న వారికి మొదటి సిలిండర్ ఇవ్వనున్నారు. అయితే ఈ సిలిండర్లు అందరికీ ఇస్తారా... లేక కొందరికే ఇస్తారా..? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం మాత్రం అర్హులందరికీ ఇస్తామంటూ ప్రకటన చేస్తోంది. కమర్షియల్, దీపం, ఉజ్వల ఇలా వివిధ కేటగిరిల్లో లబ్ధిదారులు గ్యాస్ కనెక్షన్లను తీసుకున్నారు. మరి వీరందరికీ ఇస్తారా లేక దీపం లబ్ధిదారులకు మాత్రమే ఇస్తారా..? అన్నదానిపై స్పష్టత కరువవడంతో ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొంది.

- ఉచితం అందరికా.. కొందరికా..?
- స్పష్టతనివ్వని ప్రభుత్వం
- అర్హులందరికీ అంటూ ప్రకటనలు
- ఎవరు అర్హులో తెలియని పరిస్థితి
- 'దీపం' పేరుతో అర్హులంటూ ప్రభుత్వం నుంచి సెల్‌కు సందేశాలు
- ఈకేవైసీకీ అవస్థలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందేందుకు ఈ నెల 29వ తేదీ(మంగళవారం) నుంచి బుకింగ్ ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా ఇప్పటికే లబ్ధిదారులు సిలిండర్ల కోసం బుకింగ్ ప్రారంభించారు. పాత పద్ధతిలోనే ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటున్నారు. ఈ నెల 31వ తేదీ వరకు మొదటి సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవచ్చు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చూస్తే అనంతపురం జిల్లాలో 5,57,975, శ్రీసత్యసాయి జిల్లాలో 6,67,268 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో రేషన్‌కార్డుల వారీగా చూస్తే 12,54,911 మంది ఉన్నారు. రేషన్‌కార్డు, ఆధార్, ఈకేవైసీ అన్ని పూర్తిగా, సక్రమంగా ఉన్న వారు ఎందరున్నారన్న దానిపై అధికారులు స్పష్టంగా చెప్పడం లేదు.

'దీపం'కు మాత్రమేనా..?

ప్రస్తుతం జనాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్‌పై పెద్ద చర్చ నడుస్తోంది. అందరికీ దీనిని వర్తిస్తారా.. లేక కొందరికి మాత్రమే వర్తిస్తారా అనే చర్చ నడుస్తోంది. గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి కమర్షియల్, దీపం, ప్రధానమంత్రి ఉజ్వల తదితర కేటగిరీల్లో లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో రేషన్‌కార్డు ప్రామాణికంగా అందరికీ మూడు సిలిండర్లు ఇస్తారా లేదా అన్న దానిపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వడం లేదు. ప్రభుత్వం అర్హులందరికీ ఇస్తామని చెబుతోంది తప్పా, రేషన్‌కార్డుతో కూడిన గ్యాస్ కనెక్షన్ తీసుకున్న ప్రతి ఒక్కరికీ ఉచితం ఇస్తామనే మాట ఇప్పటికీ చెప్పడం లేదు. దీంతో చాలా మంది కేవలం దీపం గ్యాస్ కనెక్షన్ ఉన్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుందనే ప్రచారం నడుస్తోంది. ఇందులో కూడా ఎవరు దీపం గ్యాస్ కనెక్షన్ పరిధిలో ఉన్నారన్న విషయం ఆ లబ్ధిదారునికి కూడా తెలియదు. చాలా మంది 20 ఏళ్ల క్రితం దీపం కనెక్షన్లు తీసుకున్నారు. ఆ తరువాత ఆధార్ అనుసంధానం, డబుల్ సిలిండర్, ఇతర మార్పుల పేరుతో కనెక్షన్ల రూపాలు మారాయి. ఇలాంటి వారంతా తమకు ఉచిత సిలిండర్ వస్తుందా.. రాదా..? అన్న సందిగ్ధంలోనే ఉన్నారు.

ఉజ్వల్ కనెక్షన్‌కు ఇవ్వరా..?

ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద గ్యాస్ కనెక్షన్లను మంజూరు చేశారు. రేషన్‌కార్డు ప్రామాణికంగా గతంలో కనెక్షన్ లేని వారందరికీ ఉజ్వల పథకం కింద కనెక్షన్ ఇచ్చారు. గ్యాస్ స్టవ్‌తో పాటు, ఒక సిలిండర్‌ను ఈ పథకం కింద ఉచితంగా ఇచ్చారు. దీని కింద గ్యాస్ పొందిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్కో సిలిండర్‌పై రూ.300 రాయితీ లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోంది. కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోంది కాబట్టి ఉజ్వల లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత సిలిండర్ పథకం పరిధిలోకి రారనే ప్రచారం నడుస్తోంది. దీనిపై కూడా ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైంది.



7:10 pm

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దీపావళి నుండి అందిస్తున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల "దీపం-2" పథకంలో నమోదు కాబడినందున శుభాకాంక్షలు. మీ సబ్సిడీ అమౌంట్,మీరు సిలిండర్ డెలివరీ తీసుకున్న 48 గంటలలో మీ బ్యాంకు ఖాతా నందు జమ చేయబడుతుందని తెలియచేస్తున్నాము.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

సిలిండర్ బుక్ చేసిన అనంతరం దీపం-2 ద్వారా ఉచిత సిలిండర్‌కు అర్హులంటూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సెల్‌ఫోన్‌కు వచ్చిన సందేశం.. అయితే ఇలాంటి సందేశాలు గ్యాస్ బుక్ చేసుకున్న అందరికీ రాలేదు...!

ఈకేవైసికి తిప్పలు

ఉచిత గ్యాస్‌కు అర్హులు కావాలంటే ఈకేవైసి తప్పనిసరి అని ప్రభుత్వం నిబంధన పెట్టింది. గ్యాస్ కనెక్షన్ నెంబర్‌కు ఆధార్ ఈకేవైసీతో అనుసంధానం కావాల్సి ఉంది. దీంతో లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు గ్యాస్ ఏజెన్సీల వద్దకు క్యూ కడుతున్నారు. మంగళవారం నాడు ఆయా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలోనే ప్రజలు బారులుదీరారు. ఈకేవైసీ చేయించుకోకపోతే ఉచిత సిలిండర్ రాదన్న భయంతో ప్రజలు అక్కడికి వెళ్తున్నారు. చాలా మంది ఇంకా ఈకేవైసీ చేయించుకోలేదని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ఈ రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగకపోతే మొదటి ఉచిత సిలిండర్‌ను లబ్ధిదారులు నష్టపోయే ప్రమాదం ఉంది.

స్పష్టత ఇవ్వాలి

ఉచిత గ్యాస్ సిలిండర్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. రేషన్‌కార్డు ద్వారా తీసుకున్న అందరికీ ఉచితంగా సిలిండర్ ఇస్తారా.. లేక దీపంకు మాత్రమే ఇస్తారా అన్న దానిపై సందిగ్ధత ఉంది. దీనిపై ప్రభుత్వం, అధికారులు స్పష్టతను ఇవ్వాలి. ఎలాంటి షరతులు లేకుండా తెల్ల రేషన్‌కార్డుతో గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా మూడు సిలిండర్లు ఇవ్వాలి.

**అరుణ, గృహిణి,
హౌసింగ్‌బోర్డు, అనంతపురం.**

దీపావళి వేడుకల్లో అప్రమత్తత ప్రధానం

జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి

శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 31న జరుపుకోనున్న దీపావళి పండుగ నేపథ్యంలో వ్యాపారస్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ టపాసులు కాల్చే సమయంలో ఏమాత్రం అప్రమత్తం లేకున్నా ఆస్తి, ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. దీపావళి నేపథ్యంలో ఎలాంటి సంఘటనలు జరిగినా జిల్లాలో అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలియజేశారు. అనంతపురం, గుంతకల్లు రాయదుర్గం, తాడపత్రి, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల అగ్నిమాపక కార్యాలయాల పరిధిలో 230 బాణసంచా దుకాణాలకు తాత్కాలిక అనుమతులను మూడు రోజులపాటు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతపురం నగరం రూరల్ పరిధిలో మొత్తంగా 141 దుకాణాలను సవేరా ఆసుపత్రి సమీపంలోని శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వ్యాపారస్తులు, దుకాణదారులు అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉందన్నారు. ఓపెన్ సైట్లలో ఐరన్ పోల్స్‌ను ఉపయోగించి షెడ్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పైకప్పులుగా సిమెంట్, ఐరన్ రేకులను వాడుకోవాలన్నారు. తడికలు లాంటివి నిషేధమన్నారు. ప్రతి దుకాణం వద్ద 200 లీటర్ల నీటి డ్రమ్ములు, ఇసుక బకెట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. కాటన్ దుస్తులను ధరించాలన్నారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు బాణసంచ కాల్చుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో ఏవైనా ప్రమాదాలు సంభవిస్తే 108, 101 నెంబర్లకుతో పాటు డిడిఆర్, ఎఫ్ఒ కార్యాలయం 08554-274398, 9949991070, అనంతపురం 08554-220299, 99637 39592, తాడిపత్రి 99637 39608, 08558-222299, కళ్యాణదుర్గం 08497-220101, 9963740504, ఉరవకొండ 9963740497, 08496-257099, గుంతకల్లు 9963739818, 08552-226299, రాయదుర్గం , 08495-252099, 9963740428 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

నాణ్యతలేని మాంసం విక్రయాలు

పరీక్షలు... పర్యవేక్షణ కరువు
పట్టించుకోని వెటర్నరీ, పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి -కణేకల్లు

మండల కేంద్రంలో మాంసం అమ్మకదారులు ఆడింది ఆట పాడింది పాటగా మారింది. మాంసం అమ్మకదారులు నాణ్యమైన మాంసం కన్నా, నాసిరకం మాంసం అమ్మకాలు చేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఆదివారం, పండగ సందర్భాల్లో ప్రజలు మాంసం కొనుగోలు చేస్తారు. ఇదే అదునుగా చేసుకుని విక్రయదారుడు అనారోగ్యమైన జీవాలు కోసి అమ్ముతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మరికొందరు అనారోగ్యం బారిన పడిన జీవాలను తీసుకొచ్చి కోసి మాంసాన్ని ఫ్రిజ్‌లో పెట్టి మరుసటి రోజు అమ్మేస్తున్నారు. మరికొందరు చిన్న గొర్రె, మేక పిల్లలను వధించి పొట్టేలు మాంసం అని చెప్పి అమ్మకాలు చేస్తున్నారు. రూ.600 పెట్టి మాంసం కొనుగోలు చేస్తున్నా నాణ్యమైనది దొరకడం లేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పెద్దలు గ్రూపులుగా విడిపోవడం వల్ల నాసిరకం మాంసం అమ్మకదారులను ప్రశ్నించే వారే కరువయ్యారు. నిబంధనల ప్రకారం వెటర్నరీ లేదా పంచాయతీ సిబ్బంది జీవాలను పరిశీలించి ధ్రువీకరించి ముద్ర వేసిన తర్వాతనే మాంసాన్ని మార్కెట్లోకి విక్రయించాల్సి ఉంటుంది. మండలంలో ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. కణేకల్లులో వెటర్నరీ, పంచాయతీ అధికారులు ఉన్నప్పటికీ మాంసం అమ్మక కేంద్రాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నాణ్యతలేని మాంసం విక్రయాలు జరగకుండా చూడాలని కణేకల్లు గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం అమ్మకాల్లో నిబంధనలకు తూట్లు

ఊరూరా బెల్టుషాపులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలంలో మద్యం అమ్మకదారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నిబంధనల మేరకు 21 సంవత్సరాల పైబడిన వ్యక్తులకు మద్యం అమ్మాల్సి ఉన్నా మద్యం షాపు నిర్వాహకులు దీనిని పక్కన బెట్టి 18 ఏళ్ల లోపు పిల్లలకు కూడా మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఇటీవల బెల్టుషాపు నిర్వహించుకునేందుకు 15 సంవత్సరాల బాలుడికి మండల కేంద్రంలోని షాపు నుంచి మద్యాన్ని విక్రయించారు. బెల్టుషాపులను ప్రోత్సహిస్తూ మద్యం ఆదాయమే పరమావధిగా యజమానులు అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.99 క్వార్టర్లను తక్కువగా కేవలం ఒక కేసు మాత్రమే అమ్మి ఆ తర్వాత అయి లేవని చెప్పి అధిక ధరతో కూడిన మద్యాన్ని విక్రయిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే తమ వద్ద స్టాక్‌లేవంటూ సమాధానం ఇస్తున్నారు. రెండు రోజుల క్రితం మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామంలో బెల్టు షాపు విషయంలో అధికార పార్టీకి చెందిన రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. మండలంలో 21 పంచాయతీలు ఉంటే అన్ని గ్రామాల్లోనూ ఇప్పటికే బెల్టుషాపులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. మండలంలో మద్యం అమ్మకాల తీరు ఇలా ఉన్నా ఎక్సైజ్ అధికారులు వారికి ఏమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనల మేరకు మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో 20,20,441 మంది ఓటర్లు

పురుషులు 9,98,784, మహిళలు 10,21,412, థర్డ్ జెండర్ ఓటర్లు 245 మంది
కలెక్టర్ వినోద్‌కుమార్
ఎస్ఎస్ఆర్-2025 డ్రాఫ్ట్ పబ్లికేషన్ విడుదల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎస్ఎస్ఆర్-2025లో భాగంగా జిల్లాలో 20,20,441 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఎస్ఎస్ఆర్-2025 డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 2,226 పోలింగ్ స్టేషన్ల పరిధిలో పురుషులు 9,98,784, మహిళలు 10,21,412, , థర్డ్ జెండర్ 245 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డ్రాఫ్ట్ పబ్లికేషన్‌ను విడుదల చేశామన్నారు. ఫైనల్ పబ్లికేషన్ వచ్చే ఏడాది జనవరి 6న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆయా పోలింగ్‌స్టేషన్ల పరిధిలో డ్రాఫ్ట్ పబ్లికేషన్లను విడుదల చేసి ప్రదర్శించాలన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో 296 పోలింగ్ స్టేషన్లు ఉండగా పురుషులు 1,30,558, మహిళలు 1,33,409, థర్డ్ జెండర్ 42 మంది ఉన్నట్లు తెలిపారు. అలాగే ఉరవకొండ నియోజకవర్గంలో 260 పోలింగ్‌స్టేషన్లు ఉండగా 1,10,702 మంది పురుషులు, 1,13,905 మంది మహిళులు, 28 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో 276 పోలింగ్‌స్టేషన్లు ఉండగా 1,33,021 మంది పురుషులు, 1,37,804 మంది మహిళలు, 74 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో 274 పోలింగ్‌స్టేషన్లు ఉండగా 1,23,513 మంది పురుషులు, 1,25,509 మంది మహిళలు, 25 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. శింగనమల నియోజకవర్గంలో 293 పోలింగ్‌స్టేషన్లు ఉండగా 1,23,266 మంది పురుషులు, 1,24,682 మంది మహిళలు, 29 మంది థర్డ్ జెండర్ ఉన్నట్లు వివరించారు. అనంతపురం నియోజకవర్గంలో 285 పోలింగ్‌స్టేషన్లు ఉండగా 1,37,943 మంది పురుషులు, 1,43,786 మంది మహిళా ఓటర్లు, 28 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 261 పోలింగ్‌స్టేషన్లు ఉండగా 1,14,603 మంది పురుషులు, 1,16,639 మంది మహిళ, ఐదుగురు థర్డ్ జెండర్ ఓటరు ఉన్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 281 పోలింగ్‌స్టేషన్లు ఉండగా 1,25,178 మంది పురుషులు, 1,25,678 మంది మహిళలు, 12 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎ.మలోల, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, ఇడిటిలు సుజాత, వరప్రసాద్, సువర్ణ, రామకృష్ణ, నాగేంద్ర, హాబీబా, ఆంజనేయప్రసాద్, ఐటి ప్రోగ్రామ్ ఇంజినీర్ శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు

జెఎన్‌టియు పరిధిలోని అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతి హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి అధ్యక్షతన డైనమిక్స్ -2కె 24 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ ఇలాంటి జాతీయ టెక్నికల్ సింపోజియం వల్ల విద్యార్థులు తమ మేధస్సును పెంచుకోవచ్చన్నారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసమే కాకుండా పరిశోధనలు చేసి అద్భుతాలు సృష్టించి దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. ప్రస్తుతం మనకు ఎడ్యుకేషన్ 4.0 నడుస్తోందన్నారు. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలే కాకుండా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలోని అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. కీ నోట్ స్పీకర్ సి.హరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యతను మిగతా విద్యార్థులకు వివరించాలన్నారు. సర్టిఫికెట్ల కోర్సులను చేయటం వల్ల ప్రాంగణ నియామకాలు, ఉపాధిలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థుల జ్ఞానానికి పరీక్ష లాంటివి అన్నారు. పరిశ్రమల అభివృద్ధికి మెకానికల్ ఇంజినీరింగ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను విడుదల చేశారు. తర్వాత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బి.చంద్రమోహన్‌రెడ్డి, బి.ఓంప్రకాష్, యూనివర్సిటీ డైరెక్టర్లు, మెకానికల్ విభాగాధిపతి కళ్యాణిరాధా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

బీపీని పరీక్షించుకుంటున్న ఎస్పీ పి.జగదీష్

ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలు ఆవరణలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్పీ సైతం జనరల్ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఉచితంగా ఈసిజి, 2 డి ఎకో, డెంటల్ , కంటి పరీక్షలు, బిపి, తదితర పరీక్షలు ఆయా విభాగాల వైద్యులు, సిబ్బంది నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకూ రోజూ పోలీస్ సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ఉచిత మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, వారి డ్యూటీ సమయాలు కూడా చాలా భిన్నంగా ఉంటాయని, ఆహారం కూడా సమయానికి తీసుకోలేని పరిస్థితులు ఉంటాయని, విధి నిర్వహణలో వారి ఆరోగ్య ప్రాధాన్యత కంటే ప్రజా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారన్నారు. సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, మహబూబ్‌బాషా, ఎస్‌బి సిఐ ధరణీకిశోర్, పోలీసు డాక్టర్ వెంకటేష్ ప్రసాద్, జిల్లా సర్వజన ఆసుపత్రి, కిమ్స్ సవీర, యాపిల్ డెంటల్ ఆసుపత్రుల నుంచి వైద్యులు నరసింహారెడ్డి, సౌజన్య, భవానీశంకర్, లావణ్య, రామ్, ఆర్‌ఐలు రెడ్డెప్పరెడ్డి, మధు, ఆర్ఎస్ఐలు జాఫర్, మగ్బూల్, రమేష్‌నాయక్, ముస్తఫా, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ ఎస్ ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం



కార్యక్రమంలో మాట్లాడుతన్న డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని డిఆర్‌డిఎ పీడీ ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని సమైక్య కార్యాలయంలో ఎంపిపి దాసరి సునీత అధ్యక్షతన వార్షిక మహాసభ నిర్వహించారు. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలను చైతన్య మండల సమైక్య ఈసీ మెంబర్ల సమక్షంలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు తమ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఆర్థికంగా చేయూత అందిచంఆలన్నారు. ఇందులో భాగంగానే బ్యాంకు రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి, ఎస్సీ, ఎస్టీ సప్లైన్, జలజీవని, గోకులం, చిన్న పరిశ్రమలు వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఆయా పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అనంతరం సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నాగలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా మాబ్బి, కార్యదర్శిగా మంగమ్మ, సహాయక కార్యదర్శిగా నారాయణమ్మ, కోశాధికారిగా రేణుకను ఎన్నుకున్నారు. ఈ క్యాక్రమంలో ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, డిపిఎం ఫైనాన్స్ సత్యనారాయణ, డిపిఎం బ్యాంకు లింకేజీ సుభద్రమ్మ, ఎసి నారాయణస్వామి, ఎపిఎం మణితేజ్, సీసీలు ఈశ్వరయ్య, అన్నపూర్ణమ్మ, ఇందిరమ్మ, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, అకౌంటెంట్ పుష్పావతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలు చేయనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం కూడేరు మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో మండల మహాసభ నిర్వహించారు. ముందుగా సిపిఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్లలో జరిగిన కార్యక్రమాలపై సమీక్ష చేసుకుని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మండలంలో పార్టీ నిర్మాణం బలపరుచుకుని గ్రామాలకు విస్తరించాలన్నారు. అలాగే మండలంలోని సర్వేనెంబర్ 535లో సాగుదారులకు న్యాయం జరిగేంత వరకూ పోరాటం చేయాలన్నారు. మండలంలోని రైతంగాన్ని ఆదుకోవాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పండ్ల తోటల రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, హంద్రీనీవా, తుంగభద్ర నీటితో చెరువులను నింపాలని, ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, ఇల్లు, స్థలాలు, సాగు భూములేని పేదలందరికీ ఇల్లు, స్థలాలు, సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇకపోతే అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలని, మంచినీరు, శ్మశాన స్థలాలు, వీధిలైట్లు, పొలాలకు రాస్తాలు తదితర సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం ఆందోళన చేయాలని తీర్మానం చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కూడేరు మండల కార్యదర్శిగా ఎస్.కరీంసాబ్, సహాయ కార్యదర్శిగా కె.వెంకటేశులు, మండల కమిటీ సభ్యులుగా సి.మల్లికార్జున, రాధాకృష్ణ, మేకల పెద్దన్న, చిన్న, చిదంబరమ్మ, లక్ష్మీదేవి, అలివేలమ్మను ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

బడ్జెట్‌లో సాగునీటికి రూ.10వేల కోట్లు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లాలో సాగునీటి కోసం బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సమైక్యాంధ్ర భవనంలో ప్రాంతీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండిస్తున్న పంటలకు సకాలంలో సాగునీరు అందకపోవడంతో పంటలను ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. తుంగభద్ర జలాశయంలో జిల్లాకు అవసరమైన సాగునీరు ఉన్నప్పటికీ ఆ నీటిని ఉపయోగించుకోవడంలో జిల్లా పాలకులు, అధికార యంత్రం పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని తెలిపారు. హెచ్ఎల్‌సి ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తికాక పోవడంతో ఆయకట్టు రైతులు తమ పంటలకు సాగునీరు అందక తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నా రు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న జీన్స్ పరిశ్ర మ అభివృద్ధి కోసం తగిన నిధులను కేటాయిం చి జీన్స్ పరిశ్రమ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. రాయదుర్గం ప్రాంతంలో సాగు, తా గునీరు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం రా నున్న రోజుల్లో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటా లు చేస్తామని తెలిపారు. అనంతరం రాయదు ర్గం, కణేకల్, గుమ్మఘట్ట, డి.హీరేహాల్ మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా బి.మల్లికార్జున ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా మధు, శివ, తిమ్మరాజు, లోకేష్, ఎం.మల్లికార్జున, కె.నాగరాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, సీనియర్ నాయకులు నాగరాజు, అంజి, ఆంజనేయులు, రమేష్, కృష్ణానాయక్, మునిస్వామి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగేంద్రకుమార్

కేబుల్ చోరీ నిందితులను పట్టుకోవాలి

సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-శింగనమల

రాత్రివేళల్లో వ్యవసాయ పొలాల్లోని కేబుల్ వైర్లను కత్తిరించి చోరీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, కల్లమడి గ్రామాల పరిధిలో వ్యవసాయ పంపుసెట్లకు ఉన్న విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు రాత్రిపూట గుర్తు తెలియని వ్యక్తులు కత్తిరించుకుపోతున్నారన్నారు. గత వారం రోజుల క్రితం పెన్నానది పరీవాహక ప్రాంతాల్లో ఉన్న తరిమెల పొలాలో పదుల సంఖ్యలో కేబుల్ వైర్లను దొంగిలించారన్నారు. గత మంగళవారం రాత్రి కూడా తరిమెల పొలాల్లో పదుల సంఖ్యలో మెటార్లకు ఉన్న కేబుల్ వైర్లను కత్తిరించుకుని ఎత్తుకెళ్లారన్నారు. పోలీసులు వెంటనే స్పందించి కేబల్ వైర్ల దొంగతనాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఆది, శ్రీనివాసులు, కొండారెడ్డి, భాస్కర్, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు, రైతుసంఘం నాయకులు

విద్యార్థుల ఆకలిబాధలు తీర్చాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన, విద్యాదీవెన నిధులు విడుదల చేయాలని కోరారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులకు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామనిహెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ స్థానిక నాయకులు వలి, గౌతమ్, అరవింద్, జీవన్, గణేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి విద్యార్థుల ఆకలి బాధలను తీర్చాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలాజీ, ధను డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్ర చేస్తున్న సమయంలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలన్నారు. పీజీ, ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, వసతి దీవెన బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం సొమ్ము చెల్లించకపోవడంతో విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని చెప్పారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని విడనాడీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప తహశీల్దార్ లలితకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఈశ్వర్, మధు, మనోజ్, పవన్, సతీష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్నేహిత్

అనంతపురం : ఎపి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఫెన్సింగ్ పోటీల్లో భాష్యం స్కూల్ విద్యార్థి కరణం స్నేహిత్‌సింహా రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థితోపాటు తల్లిదండ్రులను భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ అభినందించారు. విద్యార్థిని అభినందించిన వారిలో భాష్యం విద్యాసంస్థల రాయలసీమ జోన్ జెడ్ఈవో అనిల్‌కుమార్, అనంతపురం జిల్లా జోన్ జెడ్ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

బుక్కరాయసముద్రం : ఈనెల 26 నుంచి 28వతేదీ వరకూ వెస్ట్ గోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించిన స్కూల్‌గేమ్ ఫెడరేషన్ అండర్-17 బాస్కెట్‌బాల్ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో మండల కేంద్రానికి చెందిన పి.నాగనందిని అత్యంత ప్రతిభ కనబరిచింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నాగనందిని పోటీల్లో ప్రతిభ కనబరచడంతో జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు నాగరాజుగౌడ్, పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు రవీంద్ర, నీలకంఠారెడ్డి, దివాకర్‌రెడ్డి, పెద్దన్న, పుల్లన్న, ఆనంద్, తదితరులు నాగనందిని అభినందించారు.

ఖోఖోలో ప్రతిభ కనబరిచిన రోహిత

ఉరవకొండ : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రోహిత ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. రోహిత మంగళవారం అనంతపురంలో జూనియర్ కళాశాలలో జరిగిన అండర్-17 ఖోఖో విభాగం పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు. రోహిత ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని సర్పంచి మల్లెల జగదీష్ అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రప్ప, పీడీ లక్ష్మీప్రసాద్ అభినందించారు.

బెలుగుప్ప : రాష్ట్రస్థాయి హ్యామర్ త్రో పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.వరుణ్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ, పీడీ అమర్నాథ్ తెలిపారు. సోమవారం అనంతపురం జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి హ్యామర్ త్రో అండర్17 బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బి.వరుణ్ కుమార్ నవంబర్ 3,4 తేదీలలో శ్రీకాకుళంలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు బాలాజీ, పాఠశాల కమిటీ ఛైర్మన్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాయదుర్గం రూరల్ : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తరపున ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ బాస్కెట్‌బాల్ పోటీలకు కెటిఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థి గణేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకూ బెంగళూరులోని క్రైస్ట్ యూనివర్సిటీలో నిర్వహించనున్న పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు తెలిపారు.కళాశాల తరపున గణేష్ ఎంపిక కావడంతో అధ్యాపకులు అభినందించారు.

ఆరోగ్య భారత్ నిర్మాణానికి కృషి చేద్దాం

ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ విష్ణుప్రియ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మన ఇళ్లతోపాటు కార్యాలయాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పర్యావరణాన్ని కాపాడి ఆరోగ్య భారత్ నిర్మాణానికి కృషి చేద్దామని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 పిఒ విష్ణుప్రియ పిలుపునిచ్చారు. మంగళవారం కేంద్ర యువజన, క్రీడాసంస్థ ఆదేశాల మేరకు దివాళి విత్ మై భారత్ క్యాంపెయిన్‌లో భాగంగా ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం ఎస్ఆర్ ఆసుపత్రిలో రోగులకు పలు సేవలు అందించింది. అలాగే పాతూరు మార్కెట్ వద్ద ట్రాఫిక్ వాలంటీరింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సంతోష్‌నాయక్, వెంకట్, రోజా, తేజస్విణి, చందన, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, ఎన్‌వైకెఎస్ వాలంటీర్ నందిత, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

బ్రెయిన్ స్ట్రోక్‌పై అప్రమత్తంగా ఉండాలి

కిమ్స్ సవీరా సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ జాషువాకాలెబ్-అంతర్జాతీయ బ్రెయిన్ స్ట్రోక్స్ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

బ్రెయిన్ స్ట్రోక్స్‌పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని కిమ్స్ సవీరా సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ జాషువాకాలెబ్ సూచించారు. మంగళవారం అంతర్జాతీయ బ్రెయిన్ స్ట్రోక్స్ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ పక్షవాతం వచ్చినప్పుడు రక్త సరఫరా ఆగిపోతుందన్నారు. ఫలితంగా ప్రతి నిమిషం 1.9 మిలియన్ల నరాలు మెదడులో చనిపోతూ ఉంటాయన్నారు. పక్షవాతాన్ని గుర్తించేందుకు బి ఇ ఎఫ్ ఎ ఎస్ టి అనే పదాలను ఉపయోగిస్తారన్నారు. బి అంటే బ్యాలెన్స్ అంటే నడుస్తున్నప్పుడు అదుపుతప్పడం. ఇ అనగా ఐస్ అంటే చూపులో కలిగే లోపం, ఎఫ్ అనగా ఫేస్ అంటే మూతి వంకర పోవడం, ఏ అనగా ఆర్మ్ అనగా చేతులు, కాళ్లు చచ్చుపడటం, ఎస్ అనగా స్పీచ్ అనగా మాట తడబాటు పడడం, టి అనగా టైమ్ అంటే సమయం ప్రాముఖ్యతగా వాడుతారన్నారు. పక్షవాతం వచ్చినప్పుడు వీటిలో ఏదో ఒక్క లక్షణం ఉన్నపాటు వస్తుందన్నారు. పక్షవాతం వచ్చిన వెంటనే వైద్యం అందించడానికి కావాల్సిన అన్ని సదుపాయాలు కలిగిన వైద్యశాలకు చేరుకోవడం అత్యంత ముఖ్యం అన్నారు. మొదటి 4, 5 గంటల్లో రోగిని ఆసుపత్రికి తరలించాలన్నారు. బిపి, షుగర్, కొలస్ట్రాల్, ఊబకాయం, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు పక్షవాతనికి కారకాలు అన్నారు.

కిమ్స్ సవీరా హాస్పిటల్‌లో స్ట్రోక్ చికిత్స

కిమ్స్ సవీరా హాస్పిటల్ ఒక స్ట్రోక్ రీడీ సెంటర్ ఉందన్నారు. ఇక్కడ 150 కంటే ఎక్కువ మందికి తక్షణ చికిత్స (థ్రాంబోలైసిస్) అందించినట్లు వివరించారు. 30 నిమిషాల లోపు వైద్యం అందించడంలో రికార్డు స్థాయి విజయాన్ని సాధించామన్నారు.

కంపచెట్లు తొలగించాలని వినతి

పెదపప్పూరు : మండలంలోని అమ్మలదిన్నె గ్రామం నుంచి ఎ.కొండాపురం వరకూ, అమ్మలదిన్నె నుంచి నామనంకపల్లి, షేక్‌పల్లి మీదుగా మండల కేంద్రానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని సిపిఎం మండల నాయకు లు కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. మంగళ వారం సిపిఎం ఆధ్వర్యంలో అమ్మలదిన్నె పంచాయతీ సెక్రటరీ రామాంజురెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా దారుల్లో వెళ్లాలంటే పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్ల తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కంపచెట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపిం చే పరిస్థితి లేదన్నారు. కావున వెంటనే స్పందించి రోడ్లకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు, పిచ్చిమొక్క లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో సిపిఎం నాయకులు చలపతి, బి.కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ నాటకరచన పోటీలు

అనంతపురం : రాయలసీమ సమాజం-జీవన సంస్కృతి నేపథ్యంగా ఏకాంకిక, నాటిక, నాటక రచన పోటీల్లో రచయితలు పాల్గొనాలని రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త అప్పిరెడ్డి హరినాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంవి.రమణారెడ్డి స్మారకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాసే రచయితలు డిసెంబరు నెలలోపు రచనలు పంపాలని కోరారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌జెడి నాగలింగారెడ్డి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆర్‌జెడి నాగలింగారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు, బోధన తీరుపై ఆరాతీశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శేషయ్య, పిఆర్ఒ శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

రాష్ట్ర కౌన్సిలెంట్ అధికారి రామచంద్రుడు

ప్రజాశక్తి-శింగనమల

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర కౌన్సిలెంట్ అధికారి రామచంద్రుడు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చక్రాయపేట, బండమీదపల్లి గ్రామాల్లో పర్యటించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు. ఇందులో భాగంగా ఇళ్లతోపాటు పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీటి తొట్టెలు, పాత డ్రమ్ములు, పూలకుండీలను శుభ్రం చేస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ,జిల్లా మలేరియా నివారణ సహాయక అధికారి సత్యనారాయణ, తరిమెల వైద్యాధికారి శంకర్‌నాయక్, సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సిహెచ్ఒ గంగాధర్, సూపర్‌వైజర్లు అశ్వర్థనారాయణ, నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, హెల్త్ ప్రొవైడర్ అప్సర్‌భాను, ఆరోగ్య కార్యకర్తలు హేమలత, రమణయ్య, ఆశా కార్యకర్తలు సుభాషిణి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న రామచంద్రుడు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుట్లూరు/యల్లనూరు : మండల పరిధిలోని కోమటికుంట సబ్‌స్టేషన్‌లో 132 కెవి మరమ్మతులు చేస్తున్నందున బుధవారం మండల కేంద్రంతోపాటు యల్లనూరు మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారి విజయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 7 నుంచి నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బీమా చెక్కు అందజేత

పెద్దపప్పూరు : రెండు నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతిచెందిన మండలంలో చెర్లోపల్లి గ్రామ పంచాయతీకి చెందిన హరినాథ్‌రెడ్డి కుటుంబానికి మంజూరైన ఆర్థికసాయం చెక్కును మృతుడి భార్య హరితకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిజిబి బ్యాంకు మేనేజర్ బొజ్జప్ప, సిఎఫ్ఎల్ రవి, శ్రీలేఖ, లక్ష్మానాయక్, బ్యాంకు మిత్రి రాముడు, ఓబుల్, రాజు, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

నార్పల : విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గూగూడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. గూగూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు సింధు, రాజ, సులోచన, పావనికి ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ బి.నాగరాజు, మాథ్యూస్, కేశవకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.మదన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు పక్కీరప్ప, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

సెల్‌ఫోన్ల రికవరీలో 'అనంత' టాప్

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పదివేల సెల్‌ఫోన్లను రికరీ చేసి రాష్ట్రంలో అనంతపురం జిల్లా టాప్‌లో నిలిచిందని ఎస్పీ జి.జగదీష్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీసుపరేడ్ మైదానంలో రికవరీ మొబైల్ ఫోన్ల మేళా రూ.3.45 కోట్ల విలువజేసే 1309 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకూ 10,195 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులైనా, వ్యక్తులైనా ఎవరైనా సరే అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయొద్దని సూచించారు. అమ్మేవారు పరిచయస్తులైనా సరే బిల్లులు, సంబంధిత మొబైల్ ఫోన్ వివరాలు కల్గిన బాక్సు ఉంటేనే కొనాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, తదితర ప్రదేశాలలో మోసపు మాటలతో నమ్మబలికే వారి పట్ల ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అపరిచితులతో ఫోన్ కొనడం వల్ల ఇటు సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుడు అటు కొన్న వ్యక్తి కూడా నష్టపోతాడని గుర్తించి దూరంగా ఉండాన్నారు.

'అఫెండర్ సర్వేలెన్స్' ఆవిష్కరణ

రౌడీషీటర్లు, కిరాయి హంతకులు, ప్రాపర్టీ అఫెండర్స్, హంతకులు, తదితర నేరస్తుల కదలికలపై నిఘా ఉంచేందుకు నూతన యాప్ 'అఫెండర్ సర్వేలెన్స్'ను ఎస్పీ ఆవిష్కరించారు. జనం రద్దీగా ఉన్న ప్రాంతాలలో ఏవైనా నేరాలకు ఒడిగట్టాలనుకున్నా, రాత్రిళ్లు అనుమానాస్పదంగా నేరాల చేసేందుకు తిరుగుతున్నా.. ఈ యాప్‌లోని ఫేస్ రికగ్నేషన్ వల్ల బయటపడిపోతారు. ఈ యాప్‌ను రూపొందించిన మణికంఠ గౌతంను ఎస్పీ అభినందించారు. ఈకార్యక్రమాల్లో అదనపు ఎస్పీ డివి.రమణమూర్తి, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, రవిబాబు, శ్రీనివాస్, రామకృష్ణుడు, మహబూబ్‌బాషా, సిఐలు ధరణీకిశోర్, క్రాంతికుమార్, షేక్‌జాకీర్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ పి.జగదీష్

సిమెంట్ ఫ్యాక్టరీని సందర్శించిన విద్యార్థులు

పుట్లూరు : గుడిపాడు వద్ద ఉన్న సాగర్ సిమెంట్ పరిశ్రమను మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా పరిశ్రమ సిబ్బంది ఫ్యాక్టరీలో ఏ విధంగా సిమెంట్ తయారవుతుంది.. నాణ్యత ప్రమాణాలు ఎలా ఉంటాయి వంటి వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో అరుణ్, సయ్యద్, పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిమెంట్ పరిశ్రమ సిబ్బంది

రోడ్డు విస్తరణ పనులు పరిశీలన

పుట్లూరు : మండలంలోని అరకటవేముల గ్రామ పరిధిలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను రెవెన్యూ డివిజినల్ అధికారి వసంతబాబు మంగళవారం పరిశీలించారు. అరకటవేముల సమీపంలో జాతీయ రహదారి 544-డి విస్తరణ పనులను జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇంకా నష్టపరిహారం అందని బాధితులతో చర్చించారు. నష్టపరిహారం రాని బాధితులు తగిన ఆధారాలతో తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల పరిధిలోని ముచ్చుకోట గ్రామంలో ఆరులైన్ల రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులతో ఆర్‌డిఒ వసంతబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎవరికైనా పరిహారం అందకుంటే తహశీల్దార్ కార్యాలయంలో తగిన ఆధారాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాలాజీరాజ్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

శింగనమల : మండల పరిధిలోని సలకంచెరువు, సోదనపల్లి గ్రామాల్లో మంగళవారం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బద్వేలు ఎన్‌టిఆర్ ఎస్ఎస్‌బివిఆర్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులు హాజరై ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో పంటలు సాగు చేస్తే అత్యధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు శశికళ, పసుపు సంరక్షణ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

దుకాణం అనుమతిని రద్దు చేయాలని వినతి

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఓ గదిని ఎలాంటి టెండర్ లేకుండా ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్‌కెయు విసి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వైసిపి విద్యార్థి నాయకులు జిల్లా అధ్యక్షుడు టి.సుధీర్‌రెడ్డి, పి.హేమంత్‌కుమార్, నితిన్‌రెడ్డి, సురేష్, హర్షవర్ధన్‌రెడ్డి, సోముశేఖర్, శరత్, చెన్నకేశవరెడ్డి, గణవర్ధన్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, సోము, చిన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి డాక్యుమెంట్ పోయినది

నంద్యాల జిల్లా ప్యాపిలి పట్టణంలోని బీసీ కాలనీ ఇంటి నెంబర్ 9-50-1లో నివాసం ఉండే **కాయల శాంతి W/o కాయల లక్ష్మన్న** కు చెందిన ఇంటి **దాక్యుమెంట్ (1267/2009)** తీసుకొని గుత్తికి బస్సులో బయలుదేరాను. గుత్తి బస్టాండ్‌లో ఇంటి **దాక్యుమెంట్** పోయినది. దొరికిన వారు **ఫోన్:8106991753** ను సంప్రదించి ఇవ్వగలరని కోరుతున్నాము.

నేరాలు ఘోరాలు

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటేష్ (పాతచిత్రం)

గుత్తి : అనారోగ్యంతో బాధపడుతూ ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గొందిపల్లెలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గొల్ల వెంకటేష్ (36) తనకున్న బొలెరో వాహనాన్ని అద్దెకు నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అతడు కొన్ని నెలల క్రితం అనారోగ్యానికి గురైయ్యాడు. ఆ బాధను భరించలేక ఇంటిలో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మరణించాడు. మతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మట్టితరలింపు వాహనాలు సీజ్

రాయదుర్గం : డి.హీరేహాల్ మండలం సోమలాపురం రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఒక హిటాచిని సీజ్ చేసినట్లు విజిలెన్స్ అధికారి రాజశేఖర్ తెలిపారు. అందిన సమచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడు చేసి మట్టి తవ్వుతున్న రెండు టిప్పర్లు, హిటాచిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రజాప్రతినిధులపై చిన్నచూపు తగదు

ఎంపిపి కమలనాగరాజు

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజలతో ఎన్నుకున్న ప్రజాప్రతినిధులపై అధికారులు చిన్నచూపు చూడటం తగదని ఎంపిపి కమలనాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై ఎంపిపి అధికారులపై మండిపడ్డారు. అలాగే మూడేళ్ల నుంచి శ్మశాన స్థలం కేటాయించాలంటూ ప్రతి సమావేశంలో విన్నవిస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని ఎంపిటిసి ఈరన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు స్థలం చూపిస్తే రూ.ఐదు లక్షల సొంత డబ్బులతో కంచె వేయిస్తానన్నారు. వీటితోపాటు పలు సమస్యలపై నాయకులు ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాధాస్వామి, స్పెషల్ ఆఫీసర్ నాగేశ్వర్, సర్పంచులు విశాలాక్షి వన్నూరురెడ్డి, హసీనాబీ అతావుల్లా, మారుతీశ్వరి రామ్మూర్తి, ఎనుమలదొడ్డి సర్పంచి మహాదేవమ్మ తనయుడు విజయకుమార్, ఐసిడిఎస్ సిడిపిఒ వనజాక్షి, ఎంపిడిఒ బాలాజీ, తహశీల్దార్ శ్రీనివాసులు, ప్రభుత్వ వైద్యాధికారి అనూషాదేవి, వెలుగు ఎపిఎం సర్దానప్ప, వ్యవసాయ అధికారి మహేష్, పశు వైద్యాధికారి ప్రసాద్, హౌసింగ్ అధికారి మారుతీ, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కమల

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బెలుగుప్ప : అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు నాయకులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై సభ్యులు ఏకరువు పెట్టారు. ముందుగా ఆర్‌డబ్లుఎస్ అధికారి మాట్లాడుతూ మండలంలోని 10 గ్రామాల్లో తాగునీటి సమస్య తీర్చేందుకు ప్రభుత్వం రూ.20లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలికలకు వివాహాలు చేయరాదన్నారు. అలా చేస్తే వారికి రేషన్ కార్డులు మంజూరు చేయమన్నారు. అలాగే మండలంలోని రైతు సమస్యలను పరిష్కరించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పుష్పావతి, తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ లక్ష్మీనారాయణ, ఎంఇఒ మల్లారెడ్డి, ఇఒఆర్‌డి నాగేశ్వరరావు, ఏఓ పృథ్వీసాగర్, విద్యుత్ అధికారి గంగాధర్, డాక్టర్ కార్తీక్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ హర్షవర్ధన్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షులు పెద్దతిప్పయ్య, సునిల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడులు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వారికి రాబడిన సమాచారం మేరకు ఎస్సై విజయ్ భాస్కర్ నాయుడు మరియు సిబ్బంది కలిసి అనంతపురం టౌన్ తపోవనం శివాలయం సమీపంలో గట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళను ఆమెతోపాటు మరొక వ్యక్తిని మరియు ఒక విటుడిని అదుపులోకి తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళ పైన, మరొక ఇద్దరు వ్యక్తులుపైన అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడమైనది అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొలంబడిలో పాల్గొన్న అధికారులు

కందుకూరు, జంగాలపల్లిలో 'పొలం పిలుస్తుంది'

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం రూరల్ పరిధిలోని కందుకూరు, జంగాలపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు సాగు చేసిన వరి, ఆముదం, తదితర పంటలను పరిశీలించి తెగుళ్లపై రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కందుకూరు పశు వైద్యులు డాక్టర్ ఉషా, ఉద్యానశాఖ విస్తరణాధికారిగా విస్తరణాధికారి రామాంజనేయులు, మైక్రో ఇరిగేషన్ అధికారి హరిత, వ్యవసాయ విస్తరణ అధికారి బి.మురళీకృష్ణ, రైతు సేవాకేంద్రం సహాయకులు అపర్ణ, పద్మావతి, అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ మాధవ, సర్పంచి ప్రశాంత్‌కుమార్, ఎంపిటిసి పెద్దన్న, ఉపసర్పంచి కెపి ఓబులేసు, టిడిపి నాయకులు పూల ఓబిరెడ్డి, ఎం.బాలకృష్ణ, పి.నరసింహారెడ్డి, ఎస్.నారాయణస్వామి, ఆర్.బాలాజీ, ఆర్.మురళీకృష్ణ, మల్లికార్జున, ఉజ్జినప్ప, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

పామిడి : పామిడి మేజర్ పంచాయతీలోని కొండాపురం 1, 2వవార్డుల్లో టిడిపి నాయకులు మంగళవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఇందులో భాగంగా కార్యకర్తలకు సభ్యత్వ రసీదులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్‌పీరా, జింకల సంజీవకుమార్, బొమ్మామోహన్, పశువుల శ్రీరాములు, కరూరు శివశంకర్, 4వవార్డు రవి, కాలాపురం సుంకిరెడ్డి, వలిపి రామాంజనేయులు, రంగస్వామి, మండ్ల రాజు, శ్రీరాములు, ప్రసాద్, మారుతి, రంగా, షేక్షావలి, రమేష్, నరసప్ప, లక్ష్మన్న, లక్ష్మయ్య, ఆవుల శివ, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పొలంబడిలో పాల్గొన్న టిడిపి నాయకులు

ఉత్సవ విగ్రహాలమా!

మా వార్డుల్లో టిడిపి నేతల పెత్తనమేంటి..-కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆందోళన

ప్రజాశక్తి-గుంతకల్లు

'ప్రజల నుంచి ఎన్నుకుని సభల్లోకి వచ్చిన మేము ఉత్సవ విగ్రహాలమా'..? అంటూ పలువురు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానీ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రతిపక్ష కౌన్సిలర్లు మాట్లాడుతూ పట్టణంలోని పలు వార్డులో తాము ఇన్‌ఛార్జిలమంటూ కొందరు టిడిపి నాయకులు పెత్తనం చలాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లుగా తాముండగా వారి పెద్దనం ఏంటని వాపోయారు. ఈ సంప్రదాయం మంచిది కాదన్నారు. వార్డుల్లో పనులతోపాటు కౌన్సిలర్ల కు తెలియకుండా సమస్యల పరిష్కారం ఎలా చేస్తారని నిలదీశారు. ముఖ్యంగా డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉందని.. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని కౌన్సిలర్ సాయి పోగు రంగమ్మ వాపోయారు. మున్సిపల్ కాంట్రాక్ట్ పనులు ఒకే వ్యక్తికి (హఫీజ్ ఖాన్) కు ఇవ్వడం సరైంది కాదన్నారు. ఇచ్చిన పనులే సదరు కాంట్రాక్టర్ చేయడం లేదని కౌన్సిలర్ పవన్ కుమార్ గౌడ్ అన్నారు. అధికారుల పర్యవేక్షణ లేని కారణంగా పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని టిడిపి కౌన్సిలర్ కృపాకర్ అన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ మహమ్మద్, ఎంఇ లీలాకృష్ణ ప్రసాద్, డిఇ సురేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్.శ్రీనివాసులు, మెప్మా ప్రాజెక్ట్ ఆఫీసర్ మోహన్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సత్తార్ వలి, ఎఇ హరికృష్ణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ హరికృష్ణ, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానీ

పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-శింగనమల

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి గతిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతుసంఘం జిల్లా సమితి అధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని మట్లగొంది, కల్లుమడి పొలాల్లో రైతులు సాగు చేసిన పంటను పరిశీలించారు. అనంతరం కల్లుమడి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఎడిఎ వెంకటరాముడు, మండల వ్యవసాయ శాఖ అధికారి అన్వేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, రైతులు గురుమూర్తి, చంద్రమోహన్, సురేష్, ఓబులేష్, నల్లప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సాయం

నిత్యావసర సరుకులు అందజేస్తున్న నిర్మలమురళి

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో పేద కుటుంబానికి మంగళవారం సాయం అందజేశారు. నగరంలోని ఆదర్శనగర్‌లో నివసిస్తున్న సరోజమ్మ, నాగేంద్ర దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు యశ్వంత్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి బాగాలేదు, నరాల బలహీనత వల్ల రెండు కాళ్లు పని చేయవు. వారి పరిస్థితిని తెలుసుకున్న ట్రస్టు ఛైర్‌పర్సన్ నిర్మలమురళి బాధిత కుటుంబీలు ఇంటికి చేరుకుని రెండు నెలలకు సరిపడ 36 రకాల నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ట్రస్టు సభ్యులు ఆర్.శ్రీనివాసులు, సతీమణి శ్రీలక్ష్మి పెళ్లిరోజు సందర్భంగా సాయం అందించినట్లు తెలిపారు.

30న డయల్ యువర్ డిఎం

అనంతపురం : ఎపిఎస్ ఆర్టీసీ అనంతపురం డిపోలో రవాణా సమస్యలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ నాగభూపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ ఫోన్ నెంబకు 08554 248553, 99592 25853కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలపాలని కోరారు.

నేడు పొదుపుపై అవగాహన

అనంతపురం : అక్టోబర్ 31వ తేదీన ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నాడు ఉరకవకొండ చిన్నముస్టూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ఈఈఈ శాఖాధిపతి వై.సురేష్ బాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. వ్యక్తి అతి సులభంగా పొదుపు ఎలా చేయాలో సూచిస్తామన్నారు.

డిసెంబర్‌లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా భూమిపూజ చేసిన అభివృద్ధి పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని డివిజినల్ పంచాయతీ అధికారి సుమనజయంతి ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఆయా పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుమనజయంతి మాట్లాడుతూ పల్లె పండుగ కింద మండలంలో సుమారు రూ.5 కోట్లతో సిమెంట్ రోడ్లు, కాలువలు, ఫారపాండ్లు వంటి పనులను ప్రారంభించామన్నారు. ఆయా పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేసి సంక్రాంతి నాటికి ప్రారంభోత్సవాలు చేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, ఇఒఆర్‌డి కామాక్షి, హౌసింగ్ ఎఇ జమీల్‌బాషా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఇసి భాస్కర్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టియు నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును ఎస్‌టియు నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. తర్వాత ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, సీనియర్ నాయకులు జె.రామన్న, ఎ.అజయ్‌కుమార్, ఎపి మోడల్ స్కూల్ ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాజు, మున్సిపల్ ఉపాధ్యాయుల రాష్ట్ర కన్వీనర్ ఫణిభూషణ్, ఉపాధ్యాయ వాణి కో కన్వీనర్ జి.కిషోర్, రాష్ట్ర కౌన్సిలర్లు శివయ్య, కె.కృష్ణమోహన్, ఎస్.సురేష్‌బాబు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి వి.రాజశేఖర్, జిల్లా నాయకులు మురళీ, నాగభూషణ, రామక్రిష్ణ, జి.మల్లికార్జున, మండల నాయకులు బాబ్జీనాయక్, కరణం చంద్రశేఖర్‌స్వామి, రామాంజనేయులు, వై.రవి, తదితరులు పాల్గొన్నారు.